సబ్ స్టేషన్ ప్రారంభమెప్పుడో..?

- ఐదేళ్ల క్రితం ప్రారంభించిన పనులు
- ఫెన్సింగ్, పునాదులు వేసి వదిలేసిన కాంట్రాక్టర్
- మోటార్లు కాలిపోతున్నాయని రైతుల ఆవేదన

శాంతినగర్: లోఓల్టేజీ సమస్యలు తొలగించేందుకు మంజూరైన సబ్ స్టేషన్ నిర్మాణ మూడేళ్లయినా పూర్తికాకపోవడంతో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని జూలెకల్ గ్రామ సమీపంలో 2020 సంవత్సరంలో రూ. కోటి వ్యయంతో 33/11 కేవీ సబ్ స్టేషన్ మంజూరైంది. అప్పట్లో



కంచె వేసి ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చకుండా వదిలేసిన దృశ్యం



జూలెకల్‌లో నిలిచిన సబ్‌స్టేషన్ పనులు

పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ ఫెన్సింగ్, బేస్ మేట్ పనులు పూర్తిచేసి వదిలిపెట్టాడు. మూడేళ్లుగా అటువైపు తిరిగి చూడలేదు. పనులు ప్రారంభించారు.. విద్యుత్ సమస్య తీరుతుందని ఆశించిన ఆయా గ్రామాల ప్రజలకు చివరకు నిరాశే మిగిలింది. అంతేగాక బోర్ మోటార్లు కాలిపోతూ తీవ్రంగా పంటలు నష్టపోతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోఓల్టేజీతో మోటార్లు కాలిపోతూ..

లో ఓల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని జూలెకల్, జక్కిరెడ్డిపల్లి, కొంకల గ్రామాల రైతులు ఐదేళ్ల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకున్నారు. స్పందించిన అప్పటి ప్రజా ప్రతినిధులు, అధికారులు జూలెకల్ సమీపంలో సబ్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్ మధ్యలోనే పనులు నిలిపి వెళ్లడంతో ఓల్టేజీతో మోటార్లు కాలిపోతూ మోటార్ల మరమ్మతులకు ఖర్చులు పెడుతూ రైతులు ఆర్థికంగా నష్టపోయారు.

పంటలు దిగుబడి రాక..

లో ఓల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోవడంతో సకాలంలో పంటలకు నీటి తడులు అందించలేక పంటలు దిగుబడి తగ్గి నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. అంతేగాక పండిన ధాన్యం నాణ్యత లేకపోవడంతో అమ్మకం ధరలో వ్యత్యాసం ఉంటూ నష్టాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జిల్లా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సబ్‌స్టేషన్ పనులు త్వరితగతిన పూర్తిచేసి నష్టాల బారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మోటార్లు కాలిపోతున్నాయి..



శాంతినగర్ సబ్ స్టేషన్ నుంచి మా గ్రామ ట్రాన్స్‌ఫార్మర్లకు కరెంట్ సరఫరా చేస్తున్నారు. మా గ్రామం చివరన ఉండటంతో తరచూ మోటార్లు కాలిపోతున్నాయి. గాలి వాన పడితే కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతున్నాం. సబ్ స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసి రైతులు ఆర్థికంగా నష్టపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- ఓబులేష్ గౌడ్, రైతు, జూలెకల్

ఎక్కడి పనులు అక్కడే



ఐదేళ్ల క్రితం సబ్ స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టి వదిలేశారు. రెండేళ్లుగా కాంట్రాక్టర్ అటువైపుగా తిరిగి చూడలేదు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. సబ్ స్టేషన్ విషయమై పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులను కలిసి విన్నవించాం. సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తెలిపామని, పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెబుతున్నారు.

\- వెంకటేష్‌యాదవ్, రైతు, జూలెకల్

త్వరలో పనులు మొదలు

జూలెకల్ సబ్ స్టేషన్ పనులను మూడేళ్ల క్రితం కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలి వెళ్లిపోయారు. ఇటీవల జిల్లా విద్యుత్ శాఖ అధికారులు రీటెండర్ వేయగా మరో కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. త్వరలో పనులు మొదలుపెట్టనున్నారు. మండలంలో లోఓల్టేజీ సమస్యతో నీటి మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. పనులు పూర్తయిన వెంటనే సబ్‌స్టేషన్ ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెసాం.

\- సుబ్బారాయుడు, ఏఈ, విద్యుత్‌శాఖ, శాంతినగర్

క్లుప్తంగా

నేడు యాజమాన్య పద్ధతులపై అవగాహన

ఎర్రవల్లి: మండల పరిధిలోని పుటాన్‌దొడ్డి రైతు వేదికలో శనివారం ఉదయం 8 గంటలకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు హాజరై, రైతులకు పంట యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కావునా ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని రైతు సంఘాల నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వివరాలు నమోదు చేయించుకోవాలి



అయిజ: రైతులందరూ తమ వ్యవసాయ భూములకు సంబంధించిన వివరాలను వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాలని ఏఈఓ నవీన్ కోరారు. భూదార్ ప్రక్రియలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంట భూములకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వివరాలు నమోదు చేయాల్సిన రైతులు ఆధార్ కార్డు, పట్టాపాస్ బుక్ జిరాక్స్, ఆధార్‌కు లింక్ చేసిన మొబైల్ నంబర్ తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తులసి, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరుకు చెందిన కోడే వెంకటన్న అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు శుక్రవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

మానవపాడు: ప్రజలు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ చంద్రకాంత్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనం నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు పిచికారీపై అవగాహన



కేటీదొడ్డి: పురుగుల మందు పిచికారీ చేసే ముందు మాస్కులు, గ్లౌవ్స్, కళ్లద్దాలు ధరించాలని ఏఈఓ భరత్‌సింహ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతలకుంట గ్రామంలోని రైతువేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు సకాలంలో వృద్ధి, దిగుబడి పెంపు కోసం పురుగు మందులు, ఎరువులు వాడకం ముఖ్యమైందన్నారు. పిచికారీ సమయంలో తినడం, తాగడం, పొగ తీయడం నివారించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికే సింగిల్ విండోలు

కొత్తకోట రూరల్: రైతుల సంక్షేమానికి, వారికి సేవ చేసేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కట్టుబడి ఉన్నాయని రిజిస్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా కొత్తకోట సింగిల్ విండో కార్యాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విండోలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పలు వ్యాపారాలు నిర్వహించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూతను అందిస్తున్నాయన్నారు. కొత్తకోట విండోకు ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌ను కేటాయించిందని తెలిపారు. ప్రతి ఏడాది సంస్థకు కేంద్రం నుంచి రూ.6లక్షలు వస్తాయని, దీనిని మూడేళ్లపాటు కొనసాగించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రైతు ఇందులో సభ్యత్వం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్లు మహబూబ్ అలీ, బిక్యానాయక్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్, సీఈఓ బాలరాజుచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరి బడి'లో చేర్పుదాం



మల్దకల్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్



బిజ్వారంలో బడిబాట ర్యాలీలో టీఎస్ యూటీఎఫ్ నాయకులు, విద్యార్థులు

మల్దకల్: మన పిల్లలను మన ఊరి ప్రభుత్వ బడిలో చేర్పిద్దామని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడి బయట ఉన్న చిన్నారులందరినీ బడిలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బడిబాట ర్యాలీ నిర్వహించారు. అదే విధంగ అమరవాయి, బిజ్వారం, మేకలసోంపల్లి గ్రామాల్లో బడిబాటను టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, ఆంజనేయులు, రమేష్, గోపాల్, రమణ, రాజశేఖర్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే చేర్పించాలి

గట్టు: సర్కారు బడుల్లో నాణ్యమైన, విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ అన్నారు. తెలిపారు. శుక్రవారం గట్టు, రాయాపురం, ఆలూరు, బస్వాపురం, తుమ్మలచెరువు గ్రామాల్లో టీఎస్‌యూటీఎఫ్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ బడులను కాపాడుకుందామన్నారు. ఆహ్లాదకర వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ.. సర్కారీ బడుల్లో ఆంగ్ల బోధన కూడా కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నర్సరీ నుంచి ఇంగ్లిష్ సబ్జెక్ట్ బోధిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వెంకటరమణ, కార్యదర్శులు చంద్రకాంత్, రాజశేఖర్,లక్ష్మణ్, ఆంజనేయులు, రవికుమార్, చిరంజీవినాయుడు, బీచుపల్లి తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారి నరసింహ

కేటీదొడ్డి: మండల కేంద్రంలోని మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కుచినెర్ల గ్రామంలో కిశోర బాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ మాట్లాడారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమన్నారు. బాలల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల వారి భవిష్యత్ నాశనమవుతుందన్నారు. బాలలపై జరిగే దాడులపై 1098కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శివలీల, సోషల్ వర్కర్ పద్మ, లక్ష్మి, రమణ తదితరులు పాల్గొన్నారు.

బురద రోడ్డుపై ప్రయాణమెలా ?



వెంకటాపురం స్టేజిలో రోడ్డుపై నిలిచిన మురుగు

అయిజ: మండలంలోని వెంకటాపురం స్టేజి నాలుగు రోడ్ల కూడలి చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. శిథిలమైన రోడ్లలో మోకాటి లోతు గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షపు నీరు నిలిచి మురుగుగా మారడంతో దోమలు వ్యాపించి అనారోగ్యం పాలవుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి రోడ్డుపై ఉన్న గుంతల్లో వర్షపునీరు చేరి గుంతలు కనపడక వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అదే రోడ్లపై తిరుగుతున్నా సరే పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అయిజ: మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు చేపట్టిన పనుల్లో భాగంగా వెంకటాపురం 33 కేవీకి ప్రత్యామ్నాయంగా 33 కేవీ శాంతినగర్ ఇంటర్ లింకింగ్ పనులు చేపట్టనున్నట్లు విద్యుత్ ఏడీఈ నీలి గోవిందు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అయిజ మండలంలోని వెంకటాపురం, పర్దిపురం, కిష్టాపురం, కురవపల్లి, యాపదిన్నె, గుడిదొడ్డి, ఉప్పల, ఉప్పల క్యాంపు, నౌరోజి క్యాంపు గ్రామాలు, వడ్డేపల్లి మండలంలోని తనగల, రాజోళి మండలంలోని పచ్చర్ల, మాందొడ్డి, పెద్దధన్వాడ, నరసనూర్ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి



ఇటిక్యాల: చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాధిక అన్నారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్నారులకు అందించే రోటాసిల్ వ్యాక్సిన్ గురించి సిబ్బందికి వివరించారు. వ్యాక్సిన్ గతంలో సింగిల్ డోస్ రూపంలో వస్తుండగా ప్రస్తుతం డబుల్ డోస్ రూపంలో అందుబాటులో ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. చిన్నారులకు ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సిన్లు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి

మానవపాడు: నర్సరీలలో మొక్కలు సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నర్సరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు ఎండుముఖం పట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వనమహోత్సవం కార్యక్రమం నాటికి మొక్కలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో నర్సరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రాజోళి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం జూన్ 1వ తేదీ నుంచి జూన్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కల వారు ఆదాయ ధ్రువీకరణ, బోనఫైడ్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డుతో పాఠశాలలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న బాలల సంరక్షణ అధికారులు

గట్టు: బాల్య వివాహాలను నిర్మూలించాలని బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ సురేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో చట్టబద్ధపు దత్తత, లింగ నిర్ధారణ పరీక్షలు, బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. మైనర్లకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలను అక్రమంగా కొనడం, అమ్మడం నేరమని, అందుకోసం బాలరక్షభవన్‌ను సంప్రదించి చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రమేష్, సూపర్‌వైజర్లు వెంకటేష్, వెంకటాద్రినాయుడు, ఐసీపీఎస్ ఆర్‌డబ్ల్యూ ప్రకాష్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని అలవర్చుకోవాలి



అలంపూర్ చౌరస్తాలో శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

అలంపూర్: ఉపాధ్యాయులు నూతన విద్యా విధానాన్ని అలవర్చుకోవాలని కోర్సు డైరెక్టర్ శివప్రసాద్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు శుక్రవారం కొనసాగాయి. నియోజకవర్గంలోని అలంపూర్, మానవపాడు, ఉండవెల్లి, రాజోలి, వడ్డేపల్లి, ఇటిక్యాల మండలాల ఎస్‌జీటీలు శిక్షణ తరగతులకు హాజరయ్యారు. ఆర్పీలు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. హిందీ ఉపాధ్యాయులకు ఆర్పీలు ప్రాక్టికల్స్ ద్వారా వివరించారు. శిక్షణ అంశాలను తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలన్నారు. విద్యార్థులు విద్యాభివృద్ధికి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎం హేమలత, ఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు సూచనలు చేస్తున్న ఎంఏఓ జనార్ధన్

అయిజ: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి జనార్ధన్ అన్నారు. శుక్రవారం అయిజ శివారులోని పంట పొలంలో పత్తి విత్తనాలు నాటే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు సూచనలు చేశారు. విత్తనాలు విత్తుకునేంత వర్షాలు ఇంకా పడలేదని, భూమి పైపొరలో మాత్రమే తేమ ఏర్పడిందన్నారు. కనీసం అరడుగు లోతులో తేమ ఉండాలన్నారు. తేమశాతం తక్కువగా ఉన్నప్పుడు విత్తనాలు విత్తుతున్నారని, విత్తనాలు విత్తిన అనంతరం వర్షాలు పడకుంటే రైతులు విత్తనాలు, కూలీ ఖర్చులు నష్టపోతారని సూచించారు.

ఆర్థిక వ్యవహారాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న యూనిసెఫ్ ప్రతినిధులు

గట్టు: కిషోర బాలికలకు ఆర్థిక అవసరాలపై తప్పనిసరిగా అవగాహన కల్గి ఉండాలని యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ ఖ్యాతి సూచించారు. శుక్రవారం ఆలూరు గ్రామంలో స్నేహ సంఘాల వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కిషోర బాలికలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూనిసెఫ్ ప్రతినిధి ఖ్యాతి మాట్లాడుతూ.. కిషోర బాలికలు తప్పనిసరిగా ఆర్థిక వ్యవహారాల నిర్వహణను తెలుసుకోవచ్చన్నారు. కిషోర బాలికలు ఆర్థిక నిర్వహణ గురించి తెలుసుకునేందుకు అనేక మార్గాలు ఉన్నట్లు తెలిపారు. రోజువారీ ఖర్చులను గుర్తించి బడ్జెట్ తయారు చేసుకుని, రాబడి ఎంత? ఖర్చులు ఎంత అనేది తెలుసుకోవడం ద్వారా ఆర్థిక నిర్వాహణపై పట్టు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ ప్రతినిధులు డాక్టర్ నర్సింహారావు, ప్రముఖ్ డీపీఎం ఎల్లప్ప, జయాకర్, ఆంజనేయులు, జ్యోతి, రామకృష్ణ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



సమావేశంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

మల్దకల్: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించి, ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం క్రీడా ప్రాంగణంలో వైద్య సిబ్బంది యోగా చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు జయమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న గ్రామస్తులు

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం గ్రామంలో శుక్రవారం మారెమ్మ తల్లి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వేద పండితులు ఘనంగా నిర్వహించారు. గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులు చందాలు వేసుకొని నూతన ఆలయాన్ని నిర్మించగా శుక్రవారం వైభవంగా ప్రారంభించారు. అమ్మవారి విగ్రహాన్ని వేదమంత్రోచ్ఛరణల నడుమ ఊరేగించి గణపతి హోమం, మంత్రపుష్పం, కుంకుమార్చన తదితర క్రతువులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

మహబూబ్‌నగర్ రూరల్: రైతులు నేల స్వభావం మేరకు పంటలు సాగుచేసి దిగుబడులు పెంచుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కె.సదయ్య, డాక్టర్ వి.దివ్యరాణి అన్నారు. 'రైతు ముగింట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మాచన్‌పల్లి రైతువేదికలో పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ఆధునిక పద్ధతుల్లో పంటసాగు లాభదాయకమన్నారు. ముఖ్యంగా యూరియా వాడకంలో మెళకువలు పాటించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులు వినియోగించాలని.. ఏటా పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అదే విధంగా నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంచుకోవాలని అన్నారు. ఉద్యాన పంటల సాగుకు సంబంధించి సబ్సిడీ పరికరాలు, మల్చింగ్, పందిరి, డ్రిప్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు పి.శ్రీనివాసులు, లీడ్ బ్యాంకు మేనేజర్ కల్వ భాస్కర్, ఏఓ శృతి, ఉద్యానశాఖ అధికారిణి స్వప్న, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ జీషాన్ అలీ, సెరికల్చర్ ఆఫీసర్ జనార్దన్, టీజీఎస్‌డీసీ డీఎం ఆది నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మహా తపస్వి భగీరథుడు

వనపర్తి టౌన్: గంగాదేవిని దివి నుంచి భువికి దింపిన మహాతపస్వి భగీరథుడని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని మర్రికుంటలో నూతన ఏర్పాటు చేసిన ఏకశిల భగీరథ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగీరథుడి సహనం , పట్టుదల మనందరిలో ఉండాలని, తలపెట్టే పని పూర్తయ్యే వరకు శ్రమించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించబోతుందని, అందులో సగరులకు సైతం రాజకీయ పరమైన అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, గ్రంథాలయం చైర్మన్ గోవర్ధన్‌సాగర్, సగర సంగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.